క్లుప్తంగా

ఉపాధ్యాయుల బకాయిలు విడుదల చేయాలి



సమావేశం నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఒంగోలు వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా ఉపాధ్యాయులకు బకాయిలు విడుదల చేయలేదని, దీనిపై యూటీఎఫ్ ఉద్యమ బాట పడుతుందని రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. ఒంగోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ ఏర్పాటులో ఆలస్యమైతే 29 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవ్స్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క పాఠశాల మూతపడకుండా జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

శుభకార్యంలో పాల్గొన్న బూచేపల్లి, ఆదిమూలపు



బాలికను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, ఆదిమూలపు సురేష్


చీమకుర్తి రూరల్: మండలంలోని నిప్పట్లపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త టి.వెంకటేశ్వర్లు కుమార్తె ఓణీల ఫంక్షన్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని బాలికను ఆశీర్వదించారు. సర్పంచ్ రావులపల్లి కోటేశ్వరరావు, ఎంపీటీసీ చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలకు సత్కారం



మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న శ్రీహరి

చీమకుర్తి: అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు సేవలు అందించడంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న చీమకుర్తికి చెందిన శివం ఫౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరిని ఆదివారం ఒంగోలులో జిల్లా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా సత్కరించారు. శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేసిన సేవలకు గుర్తింపు రావడం సంతృప్తినిచ్చిందని ఈ సందర్భంగా శ్రీహరి అన్నారు.



రామతీర్థం రిజర్వాయర్‌లో నిండుగా ఉన్న నీరు



గుండ్లకమ్మ ప్రాజెక్ట్

నీళ్లు పుష్కలం.. సాగుకు వదలం.!

కూటమి హయాంలో వ్యవసాయానికి మంగళం

- రామతీర్థం, గుండ్లకమ్మలో పుష్కలంగా నీళ్లున్నా.. సాగుకు సరిపడా వదలని అధికారులు
- రామతీర్థం రిజర్వాయర్ పరిధిలో 70 వేల ఎకరాల ఆయకట్టు
- గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో 80 వేల ఎకరాల ఆయకట్టు
- రెండింటి కింద 50 వేల ఎకరాలకు మించని సాగు
- ప్రస్తుతం రామతీర్థంలో 85.2 మీటర్లు, గుండ్లకమ్మలో 3.1 టీఎంసీల నీళ్లు
- ఆయకట్టులో పంటల సాగుకు విడుదల చేయని అధికారులు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం వచ్చాక వ్యవసాయానికి పూర్తిగా ప్రాధాన్యత తగ్గించేలా అడుగులు వేస్తున్నారు. వ్యవసాయం దండగని గతంలో సీఎం చంద్రబాబు అన్న మాటలను నేటికీ ఆయన హయాంలోని పాలకులు, అధికారులు పాటిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో రైతుల కోసం కొత్తగా ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా ప్రారంభించకపోగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేశారు. పెట్టుబడి సాయంగా ఇస్తామన్న హామీని కూడా అమలు చేయలేమని ఏకంగా సీఎం చంద్రబాబే ప్రకటించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఇరిగేషన్ అధికారులు పంటల సాగుకు నీళ్లివ్వకుండా నిలిపివేశారు. జలాశయాల్లో నిండుగా నీరున్నప్పటికీ ఆయకట్టుకు సరఫరా చేయకపోవడంతో పంటల సాగు విస్తీర్ణం సగానికిపైగా తగ్గిపోయింది. రైతులు తీవ్రస్థాయిలో నష్టపోతున్నారు.

పొలాలు బీళ్లుగా మారి రైతుల అవస్థలు...

పంటలు సాగు చేద్దామంటే ఇరిగేషన్ అధికారులు సాగర్ నీళ్లివ్వరు. వచ్చిన అరకొర నీటితో సాగు చేద్దామంటే వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడి సాయానికి చంద్రబాబు హయాంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. సొంత డబ్బు పెట్టి వ్యవసాయం చేద్దామంటే దిగుబడి వచ్చినా.. పంటకు గిట్టుబాటు ధర రావడం లేదు. దీంతో పంటలు సాగుచేయలేక పొలాలను బీళ్లుగా వదిలేయలేక రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రామతీర్థం రిజర్వాయర్, గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లో నీళ్లు పుష్కలంగా ఉన్నప్పటికీ తాగునీటికి గుక్కెడు నీళ్లిచ్చి ఆయకట్టులో ఆరుతడి పంటలకు మాత్రమే ఇస్తున్నారు. దాని వలన పంటలు అరకొరగా సాగుచేస్తే పెట్టిన డబ్బులు వస్తాయో.. రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరకు పొలాలన్నీ బీళ్లుగా మారుతున్నాయి.

ప్రభుత్వ తీరుతో కాడి కింద పడేసిన రైతులు...

అరకొర నీటితో చేసే వ్యవసాయంతో పంటల సాగుకు పెట్టిన ఖర్చులు కూడా రావడం లేదు. వెనక్కి తిరిగి చూసుకుంటే పెట్టుబడి కోసం బ్యాంక్‌లలో తాకట్టు పెట్టిన బంగారాన్ని కూడా తిరిగి తెచ్చుకునే పరిస్థితి లేదు. ఇలాంటి దశలో రైతులు వ్యవసాయం చేయాలంటే సాయం చేసే ప్రభుత్వం ఉండాలి. కానీ, కూటమి ప్రభుత్వానికి వ్యవసాయానికి సాయం చేసే ఉద్దేశమే లేదని తెలియడంతో ఒక వైపు అప్పులు పుట్టే పరిస్థితి లేక.. మరోవైపు నీళ్లు కూడా సరఫరా చేయక రైతులు కాడి కింద పడేశారు. పచ్చని పొలాలు బీళ్లుగా మారుతున్నా ఆవేదన చెందడం మినహా చేసేది లేక మౌనంగా రోదిస్తున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లో, రామతీర్థం రిజర్వాయర్‌లో సాగర్ నీళ్లు పుష్కలంగా ఉన్నా.. పంటల సాగుకు నీళ్లు కావాలని అన్నదాతలు అడగకపోవడమే అందుకు నిదర్శనంగా ఉంది.



పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

నిర్లక్ష్యంగా అధికారులు, పాలకులు...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్చిదిద్దిన గుండ్లకమ్మ ప్రాజెక్ట్, రామతీర్థం రిజర్వాయర్లు జిల్లాకే తలమానికంగా ఉన్నాయి. దాదాపు రూ.600 కోట్లతో గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌ను వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించి 2008లో జిల్లా ప్రజలకు అంకితం చేశారు. దాదాపు రూ.60 కోట్లతో రామతీర్థం రిజర్వాయర్‌ను వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించి 2009లో ప్రజలకు అంకితం చేశారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లోని కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా సుమారు 80 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు, రామతీర్థం రిజర్వాయర్ పరిధిలో 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు డిజైన్ చేసి నిర్మించారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లో 3.89 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 3.1 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజూ 900 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ద్వారా గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతోంది. కానీ, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పరిధిలో ఖరీఫ్ సీజన్ పూర్తయినా.. లేట్ ఖరీఫ్ కూడా పూర్తి కావస్తున్నా వరినాటిన రైతులు 2 వేల ఎకరాలకు మించి లేరంటే.. రైతులు వరి సాగుకు ఏ స్థాయిలో ఆలోచిస్తున్నారో స్పష్టమవుతోంది. ఆరుతడి పంటలైన పొగాకు, శనగ, మొక్కజొన్న పంటల వైపు రైతులు ఆసక్తి చూపటం వెనుక పొలాలు, పంటలపై పెట్టే పెట్టుబడులను తగ్గించుకోవడానికే రైతులు ఇష్టపడుతున్నారని అర్థమవుతోంది.

రామతీర్థంలో 85.2 మీటర్ల నీరు

రామతీర్థం రిజర్వాయర్‌లో పూర్తి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా, ప్రస్తుతం 85.2 మీటర్ల వరకు ఉన్నాయి. రిజర్వాయర్ నుంచి దిగువకు సాగు, తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వదులుతున్నాం.

– కోటేశ్వరరావు, ఎన్ఎస్‌పీ జేఈ

గుండ్లకమ్మ నుంచి 120 క్యూసెక్కుల నీరు విడుదల

గుండ్లకమ్మ ప్రాజెక్ట్ పూర్తి నీటి సామర్థ్యం 3.89 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 3.1 టీఎంసీలు ఉన్నాయి. దాని నుంచి ఎడమ ప్రధాన కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 20 క్యూసెక్కుల నీరు విడుదలవుతున్నాయి.

– నాగరాజు, గుండ్లకమ్మ ప్రాజెక్ట్ డీఈ

అదేవిధంగా రామతీర్థం రిజర్వాయర్ పూర్తి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా, ప్రస్తుతం అందులో 85.2 మీటర్ల సాగర్ జలాలు ఉన్నాయి. నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ 70 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఉన్న రామతీర్థం కింద ప్రస్తుతం వరి, ఇతర పంటలన్నీ కలిపి కనీసం 15 వేల ఎకరాలకు మించలేదంటే ఆశ్చర్యం కలిగిస్తుంది. సుబాబుల్, పొగాకు, ఇతర పంటలు సాగుచేస్తున్నారే తప్ప వరి పంటకు మంగళం పలికే పరిస్థితి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోకపోవడంతో పాటు అధికారులు, పాలకులు వ్యవసాయాన్ని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పెట్టుబడి సాయంతో పాటు ఆయకట్టుకు నీళ్లు అందించకపోతే రైతులు పంటలు సాగు చేయకుండా పొలాలను బీళ్లుగా ఉంచే పరిస్థితి నెలకొంది. చివరకు జిల్లాకు తలమానికంగా ఉన్న గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్‌లు తాగునీటి అవసరాలకు తప్ప సాగునీటి అవసరాలకు ఉపయోగపడవనే ఆందోళన అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

ఘనంగా శ్రీకృష్ణ లీలారింఛోళి గ్రంథావిష్కరణ



శ్రీకృష్ణ లీలారింఛోళి గ్రంథావిష్కరణలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, కళామిత్ర మండలి నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: ప్రముఖ పద్య కవి, గిడుగు పురస్కార గ్రహీత డీవీఎం సత్యనారాయణ రచించిన శ్రీకృష్ణ లీలారింఛోళి గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే, పూర్వ ఉపసభాపతి డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. కళా మిత్ర మండలి, వీవీఐటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సభలో బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పద్యం తెలుగు వారి ఆత్మ అని అన్నారు. సత్యనారాయణ రచించిన శ్రీకృష్ణ లీలారింఛోళి భక్తి పూర్వక పద్యకావ్యమని, పేజీకొక పద్యాన్ని హృద్యంగా, దానికి తగినట్లు గద్య రూప వివరణ బాగుందని ప్రశంసించారు. గౌరవ అతిథిగా హాజరైన కళారత్న డా.భూసురపల్లి వెంకటేశ్వర్లు పుస్తకాన్ని సమీక్షిస్తూ 152 పద్యాలతో భక్తి సాహిత్య లోకానికి ఇచ్చాడని, ఇవి ముక్తక సమూహం(రింఛోళి) అయినా కావ్య గౌరవానికి ఎంతో అర్హమైనదన్నారు. ఆత్మీయ అతిథులుగా వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), భాషా విభూషణ నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, ఖజానాశాఖ ఉప సంచాలకులు అన్నాపంతుల జగన్నాథరావు, కళామిత్ర మండలి ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్ బాబులతోపాటు గాడేపల్లి దివాకర్ దత్తు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి ఘోర కవి సంపత్, యువీ రత్నం తదితరులు కవి కృషిని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వాహకులు కవిని ఘనంగా సత్కరించారు. సభకు ముందు మోదుగుల రవికృష్ణ రచించిన శ్రీకృష్ణ భక్త సంవాదం గల్పికను ధేనువకొండ వెంకట సుబ్బారావు బృందం ప్రదర్శించారు. జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రముఖ గాయిని చల్లా నాగేశ్వరమ్మ జిల్లా గేయాన్ని ఆలపించారు. చందూ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు చేసిన దేశభక్తి జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా జిల్లా అవతరణ దినోత్సవం



టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లా 56వ అవతరణ దినోత్సవాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ ఏఆర్ దామోదర్, పోలీసు అధికారులు పాల్గొని ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొదటి సారిగా పోలీస్ కార్యాలయంలో జిల్లా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1970 ఫిబ్రవరి 2వ తేదీ నెల్లూరు, కర్నూలు, గుంటూరు జిల్లాల నుంచి ఒంగోలు జిల్లా ఆవిర్భవించిందన్నారు. తర్వాత 1972 డిసెంబరు 5వ తేదీ ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జ్ఞాపకార్థం ప్రకాశం జిల్లాగా నామకరణం చేయబడిందన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పేరు మీదుగా జిల్లా ఏర్పడిందన్నారు. జిల్లాలో ఎందరో ప్రముఖులు ఉండటంతో పాటు ప్రజాకళలు, సంప్రదాయాలు, గ్రానైట్, ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. 56 సంవత్సరాలలో జిల్లా అనేక అంశాలలో ప్రగతి సాధించిందని తెలిపారు. ప్రత్యేకించి నేరాల దర్యాప్తు, ఇతర అంశాలలో ప్రముఖంగా ఉందన్నారు. రానున్న రోజులలో ఇంకా సమిష్టిగా పనిచేస్తూ జిల్లాను ముందు వరుసలో నిలబెడదామన్నారు. అనంతరం పోలీసు సిబ్బందికి ఎస్పీ స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలూకా సీఐ అజయ్‌కుమార్, ఒంగోలు ఆర్ఐ సీతారామిరెడ్డి, రమణారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రాదండి.. ఆటోలే దిక్కండి!

- తర్లుపాడు మండలంలోని 15 గ్రామాలకు తిరగని ఆర్టీసీ బస్సులు
- ప్రజలతోపాటు వందలాది మంది విద్యార్థులకు ఆటోలే దిక్కు
- బస్సులు తిప్పే అవకాశం ఉన్నా ఆ దిశగా ఆలోచించని అధికారులు

తర్లుపాడు: డివిజన్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రమైన మార్కాపురానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న తర్లుపాడు మండలంలోని సుమారు 15 గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదకరమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల్లోనే మార్కాపురానికి వస్తున్నారు. ఆర్టీసీ బస్సుల సౌకర్యం మండల కేంద్రమైన తర్లుపాడుకు, తర్లుపాడు మీదుగా తాడివారిపల్లి, మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కనిగిరికి ఉంది. తద్వారా మార్కాపురం-తర్లుపాడు మధ్యలో ఉన్న సీతానాగులవరం, మీర్జాపేట, నాగెళ్ల ముడుపు, తాడివారిపల్లి గ్రామాల ప్రజలు మాత్రమే బస్సు ఎక్కగలుగుతున్నారు. అప్పటికీ ఆయా గ్రామాల నుంచి ఉదయం పూట మార్కాపురం చేరుకోవాలంటే ఆటోల్లో రావాల్సిందే. తర్లుపాడు మండలంలోని 16 పంచాయతీల్లో 21 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలతోపాటు మార్కాపురంలో చదువుకుంటున్న సుమారు 500 మందికి పైగా విద్యార్థులు అటు తర్లుపాడు, ఇటు మార్కాపురం వెళ్లేందుకు ఆటోలే దిక్కయ్యాయి.

బస్సు లేనిది ఈ గ్రామాలకే..

స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలైనా తర్లుపాడు మండలంలోని పలు గ్రామాలకు ఇప్పటికీ ఆర్టీసీ బస్సు తిరగడం లేదు. ప్రభుత్వాలు పల్లె వెలుగులు ఏర్పాటు చేసినా అవి కొన్ని మండలాలకే పరిమితమయ్యాయి. వెనుకబడిన తర్లుపాడు మండలంపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ప్రగతికి రథ చక్రాలు ఆర్టీసీ బస్సులు అంటూ గొప్పగా ప్రచారం చేస్తున్నా పల్లెలకు మాత్రం ఇప్పటికీ బస్సులు తిప్పడం లేదు. పోతలపాడు, గానుగపెంట, మంగళకుంట, కొత్తూరు, ఓబాయపల్లె, కొండారెడ్డిపల్లి, జగన్నాథపురం, తుమ్మలచెరువు, బుడ్డపల్లి, సూరేపల్లి, కేతగుడిపి తదితర గ్రామాల్లో ఇప్పటికీ ఆర్టీసీ అడుగు పెట్టలేదు. ఆయా గ్రామాల ప్రజలు ఆటోల్లోనే రాకపోకలు కొనసాగిస్తున్నారు. గర్భిణులు సైతం కాన్పు సమయంలో ప్రమాదకరమని తెలిసినా గత్యంతరం లేక ఆటోల్లోనే వస్తుంటారు. మండల కేంద్రమైన తర్లుపాడులో ఎంపీడీఓ, తహసీల్దార్, పోలీసుస్టేషన్, వ్యవసాయశాఖ, వెలుగు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం వచ్చేవారు సొంత వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

ఇలా బస్సులు నడపొచ్చు

- మార్కాపురం నుంచి గానుగపెంట, పోతలపాడు మీదుగా దొనకొండ వరకు బస్సు నడిపే అవకాశం ఉంది.
- మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా కంభం పట్టణానికి షటిల్ సర్వీస్ ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.
- మార్కాపురం నుంచి తుమ్మలచెరువు, తర్లుపాడు మీదుగా పొదిలి వరకు బస్సు నడిపితే 6 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.
- కంభం నుంచి తర్లుపాడు మీదుగా పొదిలి వరకు బస్సులు నడపాలనేది మండల ప్రజల చిరకాల కోరిక.

దొనకొండ వరకు బస్సు నడపాలి

మార్కాపురం నుంచి రాయవరం, గానుగపెంట, పోతలపాడు మీదుగా దొనకొండ వరకు బస్సులు నడిపితే ప్రయోజనకరంగా ఉంటుంది. చదువుకునే విద్యార్థులు, ఇతర పనుల నిమిత్తం వెళ్లే ప్రజలకు సౌకర్యంగా కూడా ఉంటుంది.

– బాలయ్య, గానుగపెంట

మండల కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు

మండల కేంద్రమైన తర్లుపాడుకు వెళ్లేందుకు తుమ్మలచెరువు నుంచి బస్సు సౌకర్యం లేదు. కనీసం ఆటో సౌకర్యం కూడా లేదు. వివిధ పనుల నిమిత్తం తర్లుపాడుకు సొంత వాహనాల్లో వెళ్తున్నాం. సొంత వాహనాలు లేనివారు నడిచి వెళ్లాల్సిన దుస్థితి. మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా పొదిలి వరకు బస్సు ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. జిల్లా కేంద్రానికి వెళ్లాలన్నా సులువుగా వెళ్లే అవకాశం ఉంటుంది.

– అబ్దుల్ పఠాన్, తుమ్మలచెరువు

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు శూన్యం

ఆర్టీసీ బస్సు సౌకర్యం విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పెడచెవిన పెడుతున్నారు. నేటికీ మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. సచివాలయం ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలి.

– అక్బర్ అలీ, కోఆప్షన్ సభ్యుడు

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఒంగోలు రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళలు ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ ఫిబ్రవరి 6 నుంచి మార్చి 7వ తేదీ వరకూ 30 రోజుల పాటూ నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ పూర్తి వివరాలతో 9573363141 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



తోకపల్లిలో నరసింహస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు భవానీప్రసాద్

పెద్దారవీడు: మండలంలోని తోకపల్లి గ్రామంలో వెలసిన సద్గురు యోగానంద నరసింహస్వామి ఆలయంలో మాలధరించిన స్వాములు శనివారం రాత్రి మహాపడి పూజ కనుల పండుగగా నిర్వహించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారిని పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి, గణపతి చిత్రపటాలకు, 11 మెట్లను పూలతో అలంకరించారు. గణపతి పూజతో ప్రారంభించి అభిషేకం, కలశం, అమ్మవారి పూజలు చేశారు. సద్గురు యోగానంద నరసింహస్వామికి 15 రకాల అభిషేకాలు, ఆభరణాలు నిర్వహించి మహాపడి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మాలధారణ స్వాములు, భక్తులతో నరసింహస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. పడిపూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తులకు అల్పాహారం వితరణ చేశారు.